06-10-2021 ఉదయము : మురళి ఓంశాంతి "బాప్‌దాదా" మధువనము

" మధురమైన పిల్లలూ - ఈ పాత ప్రపంచం నుండి అనంతమైన వైరాగులుగా అవ్వండి ఎందుకంటే తండ్రి మీ కొరకు నూతన స్వర్గమనే ఇల్లు తయారుచేస్తున్నారు. "

ప్రశ్న :- ఈ అవినాశి రుద్ర జ్ఞాన యజ్ఞంలో ఏ ఏ విషయాల కారణంగా విఘ్నాలు ఏర్పడ్తాయి ?

జవాబు :- ఇది శివబాబాచే రచింపబడిన అవినాశి రుద్ర జ్ఞాన యజ్ఞము. ఇందులో మీరు మనుష్యుల నుండి దేవతలుగా అయ్యేందుకు పవిత్రంగా అవుతారు. భక్తి మొదలైనవి వదిలేస్తారు. అందువలన విఘ్నాలు ఏర్పడ్తాయి. జనులు శాంతి కావాలని అంటారు, వినాశనం జరగరాదని అంటారు. తండ్రి ఈ రుద్ర జ్ఞాన యజ్ఞాన్ని రచించిందే - పాత ప్రపంచ వినాశనం కొరకు. దాని తర్వాతనే శాంతి ప్రపంచం వస్తుంది.

ఓంశాంతి. ఓంశాంతి అర్థాన్ని తండ్రి పిల్లలకు తెలియజేశారు. నేను ఆత్మ, నా స్వధర్మము శాంతి. శాంతిధామంలోకి వెళ్లేందుకు ఏ పురుషార్థమూ చేసే పని లేదు. ఆత్మ స్వయం శాంతి స్వరూపము, శాంతిధామ నివాసి. ఇక్కడ కొద్ది సమయం మాత్రమే శాంతిగా ఉండగలరు. నా కర్మేంద్రియాల శరీరము అలసిపోయింది, నేను నా స్వధర్మంలో నిల్చిపోతాను, శరీరం నుండి వేరుగా అవుతానని ఆత్మ అంటుంది.కానీ కర్మలు చేసే తీరాలి. శాంతిగా ఎంత సేపు కూర్చుని ఉంటారు. ఆత్మ అంటుంది - నేను శాంతిదేశ నివాసిని. కేవలం ఇక్కడ శరీరంలోకి వచ్చినందున టాకీ(మాట్లాడుట)గా అయ్యాను. నేను ఆత్మను, ఈ శరీరం నాది. ఆత్మనే పతితంగా, ఆత్మనే పావనంగా అవుతుంది. ఆత్మ పతితంగా అయితే శరీరం కూడా పతితంగా అవుతుంది. సత్యయుగంలో పంచ తత్వాలు సతోప్రధానంగా ఉంటాయి. ఇక్కడ పంచ తత్వాలు తమోప్రధానంగా ఉన్నాయి.బంగారులో కల్తీ చేరినందున బంగారు పతితంగా అవుతుంది. దానిని శుభ్రం చేసేందుకు అగ్నిలో వేస్తారు. దానిని యోగాగ్ని అని అనరు. యోగమనే అగ్ని కూడా ఉంది. దాని వలన పాపాలు భస్మమైపోతాయి. ఆత్మలను పతితము నుండి పావనంగా చేయువారు పరమాత్మ. పేరు కూడా ఒక్కరిదే ఉంది. వారినే *ఓ పతితపావనా! రండి అని* పిలుస్తారు. డ్రామాప్లాను అనుసారం అందరూ పతితంగా, తమోప్రధానంగా అయ్యే తీరాలి. ఇది వృక్షము కదా. ఆ వృక్షానికి బీజము క్రింద ఉంటుంది. దీని బీజము పైన ఉంటుంది. తండ్రిని పిలిచినప్పుడు బుద్ధి పైకి వెళ్లిపోతుంది. ఎవరి నుండి అయితే మీరు వారసత్వం తీసుకుంటున్నారో వారిప్పుడు క్రిందికి వచ్చి ఉన్నారు. నేను రావలసి వస్తుంది అని అంటున్నారు. ఇది నా మనుష్య సృష్టి వృక్షము. ఇది అనేక వెరైటీ ధర్మాల వృక్షము. ఇప్పుడిది తమోప్రధానమై, పతితమై శిథిలావస్థను పొందుకుంది. తండ్రి కూర్చొని పిల్లలకు అర్థం చేయిస్తున్నారు -

సత్యయుగంలో మొదట దేవీ దేవతలుండేవారు, ఇప్పుడు కలియుగంలో అసురులు ఉన్నారు. పోతే అసురులకు, దేవతలకు యుద్ధము జరగనే లేదు. మీరు ఈ అసురీ పంచ వికారాల పై యోగబలంతో విజయాన్ని పొందుతారు. అంతేకానీ హింసాత్మక యుద్ధము మాటే లేదు. మీరు ఏ విధమైన హింసా చేయరు. మీరు ఎవ్వరినీ చేతితో కూడా కొట్టరు. మీరు డబల్ అహింసకులు. కామ ఖడ్గాన్ని ఉపయోగించడం అన్నిటికంటే పెద్ద పాపం. తండ్రి అంటున్నారు - ఈ కామ ఖడ్గము ఆదిమధ్యాంతాలు దుఃఖమునిస్తుంది. వికారాలకు వశమవ్వరాదు. మీరు సర్వగుణసంపన్నులు, సంపూర్ణ నిర్వికారులని దేవతల ముందు మహిమను గానము చేస్తారు. ఆత్మ ఈ అవయవాల ద్వారానే అర్థం చేసుకుంటుంది. మేము పతితులుగా అయిపోయామని అంటారు అనగా ఎప్పుడో పావనంగా ఉండేవారు కదా! అందుకే ఇప్పుడు పతితులుగా అయ్యామని అంటారు. *ఓ పతితపావనా రండి! అని* పిలుస్తారు. పావనంగా ఉన్నప్పుడు ఎవ్వరూ పిలవరు. దానిని స్వర్గమని అంటారు. ఇక్కడ సాధు సత్పురుషులు మొదలైన వారందరూ పతితపావనా సీతా-రామ!...... అని అంటూ ఎంతగానో భజనలు చేస్తూ ఉంటారు. ఎక్కడికి వెళ్ళినా ఇలా పాడుతూనే ఉంటారు. ఈ ప్రపంచమంతా పతితంగానే ఉందని తండ్రి అర్థంచేయిస్తున్నారు. ఇప్పుడిది రావణ రాజ్యము కదా. రావణుని తగులబెడ్తారు. కానీ అతని రాజ్యము ఎప్పటి నుండి ప్రారంభమయిందో ఎవ్వరికీ తెలియదు. భక్తిమార్గములోని సామగ్రి చాలా ఎక్కువగా ఉంది. ఏదేదో చేస్తూ ఉంటారు. సన్యాసులు కూడా చాలా రకాల యోగాలు నేర్పిస్తారు. నిజమైన యోగమంటే ఏమిటో ఎవ్వరికీ తెలియదు. ఇది కూడా ఎవరి దోషమూ కాదు. ఇది తయారైన డ్రామా. ఎంతవరకు నేను రానో, వీరు తమ పాత్రను అభినయించవలసి ఉంటుంది. జ్ఞానము మరియు భక్తి. జ్ఞానమనగా పగలు, సత్య - త్రేతా యుగాలు. భక్తి అనగా రాత్రి, ద్వాపర - కలియుగాలు. తర్వాత వైరాగ్యము అనగా ఈ పాత ప్రపంచము నుండి వైరాగ్యము. ఇది బేహద్ వైరాగ్యము, వారిది హద్దు వైరాగ్యముఈ పాత ప్రపంచము ఇప్పుడు సమాప్తం అవ్వబోతుందని మీకు తెలుసు. నూతన ఇల్లు తయారవుతే పాత ఇంటి పై వైరాగ్యం కలుగుతుంది.

అనంతమైన తండ్రి ఎలా ఉన్నారో చూడండి. మీకు స్వర్గమనే ఇల్లు తయారు చేసి ఇస్తారు. నూతన ప్రపంచాన్ని స్వర్గమని అంటారు. పాత ప్రపంచం నరకం. కొత్త నుండి పాతదిగా అవుతుంది. మళ్లీ అదే కొత్తదిగా అవుతుంది. కొత్త ప్రపంచపు ఆయువు ఎంతో కూడా ఎవ్వరికీ తెలియదు. ఇప్పుడు పాత ప్రపంచంలో ఉంటూ మనము దానిని క్రొత్త ప్రపంచంగా తయారు చేస్తాము. పాత శ్మశానం పై మనము స్వర్గాన్ని తయారు చేస్తాము. ఇదే యమునా నదీ తీరముంటుంది. ఈ తీరములోనే భవనాలు తయారౌతాయి. ఈ ఢిల్లీయే యమునా నదీ తీరంలో ఉంటుంది. ఇక్కడ పాండవుల కోట ఉండేదని

చూపిస్తారు. అవన్నీ డ్రామా ప్లాను అనుసారం మళ్లీ తయారౌతాయి. మీరు యజ్ఞాలు, జప-తపాలు, దానాలు మొదలైనవి మళ్లీ చేయవలసి వస్తుంది. మొదట శివుని భక్తి చేస్తారు, ఫస్ట్‌క్లాసు మందిరాలు తయారుచేస్తారు. దానిని అవ్యభిచారి భక్తి అని అంటారు. ఇప్పుడు మీరు జ్ఞానమార్గంలో ఉన్నారు. ఇది అవ్యభిచారి జ్ఞానము. మీరు ఒక్క శివబాబా నుండే వింటారు. మొదట మీరు వారినే భక్తి చేశారు. ఆ సమయంలో ఇతర ధర్మాలేవీ ఉండవు. ఆ సమయంలో మీరు చాలా సుఖంగా ఉంటారు. దేవతా ధర్మము చాలా సుఖమిచ్చేది. పేరు తలుస్తూనే నోరు మధురంగా అవుతుంది. మీరు ఒక్క తండ్రి నుండి మాత్రమే జ్ఞానము వింటారు. తండ్రి అంటున్నారు - ఇతరులెవ్వరి నుండి మీరు వినకండి. ఇది మీ అవ్యభిచారి జ్ఞానము. మీరు అనంతమైన తండ్రికి చెందినవారిగా అయ్యారు. తండ్రి నుండే మీకు నెంబరువారు పురుషార్థానుసారం వారసత్వం లభిస్తుంది. తండ్రి కొద్ది



సమయం కొరకు సాకారంలోకి వచ్చారు. నేను పిల్లలైన మీకు మాత్రమే జ్ఞానమివ్వాలి. నాకు ఇది స్థిరమైన శరీరము కాదు. నేను ఇందులో తాత్కాలికంగా ప్రవేశిస్తాను. శివజయంతి తర్వాత వెంటనే గీతా జయంతి జరుగుతుంది. దానితో ఈ జ్ఞానము ప్రారంభిస్తారు. ఈ ఆత్మిక చదువును పరమాత్మ చదివిస్తున్నారు. నీటి విషయమేదీ లేదు. నీటిని జ్ఞానమని అనరు. జ్ఞానము వలన పతితుల నుండి పావనంగా అవుతారు, నీటి ద్వారాపావనంగా అవ్వరు. నదులు ప్రపంచమంతా ఉండనే ఉన్నాయి. జ్ఞానసాగరులైన తండ్రి వచ్చి ఇతనిలో ప్రవేశించి జ్ఞానం వినిపిస్తారు. ఇక్కడ గోముఖానికి వెళ్తారు. వాస్తవానికి గోముఖమంటే చైతన్యంలో మీరే. మీ నోటి నుండి జ్ఞానామృతం

వెలువడుతుంది. ఆవు నుండి పాలు లభిస్తాయి అంతేగానీ నీరు రాదు. ఈ విషయాలన్నీ తండ్రి కూర్చొని అర్థం చేయిస్తున్నారు. వారు సర్వుల సద్గతిదాత. ఇప్పుడు అందరూ దుర్గతిలో పడి ఉన్నారు. ఇంతకుముందు రావణుని ఎందుకు తగులబెడ్తారో మీకు తెలియదు. ఇప్పుడు అనంతమైన దశరా జరగనున్నదని మీకు తెలుసు. ఈ ప్రపంచమంతా ఒక ద్వీపంగాఉంది. పూర్తి సృష్టి పై రావణ రాజ్యముంది.శాస్త్రాలలో వానర సైన్యముండేదని, కోతులు వారధిని కట్టారని.... అని వ్రాసేశారు. ఇవన్నీ కట్టుకథలు. భక్తి మొదలైనవి నడుస్తాయి. మొదట అవ్యభిచారి భక్తి, తర్వాత వ్యభిచారి భక్తి. దశరా, రక్షాబంధనం మొదలైనవన్నీ ఇప్పటి పండుగలే. శివజయంతి తర్వాత కృష్ణ జయంతి. ఇప్పుడు కృష్ణపురం స్థాపనౌతూ ఉంది. ఇప్పుడిది కంసపురం. రేపు కృష్ణపురముంటుంది. ఆసురీ సంప్రదాయాన్ని కంసుడు అని అంటారు. పాండవుల, కౌరవుల యుద్ధము లేనే లేదు. కృష్ణుని జన్మ సత్యయుగంలో జరుగుతుంది. అతను మొట్టమొదటి రాకుమారుడు. అతను పాఠశాలలో చదివేందుకు వెళ్తాడు, పెద్దవాడైన పిదప రాజసింహాసనం పై కూర్చుంటాడు. మహిమంతా ఒక్క శివబాబాదే. వారు పతితులను పావనంగా చేయువారు. ఈ రాసలీల మొదలైనవన్నీ పరస్పరం సంతోషంగా జరుపుకునేవి. కృష్ణుడు ఎవరికైనా జ్ఞానమెలా వినిపిస్తాడు? తండ్రి చెప్తున్నారు - ఎవ్వరికీ భక్తి చేయకండి అని చెప్పకండి. దానంతకదే వదిలిపోతుంది. భక్తి వదిలేస్తారు, వికారాలను కూడా వదిలేస్తారు. అందువల్లనే గొడవలు జరుగుతాయి. తండ్రి అంటున్నారు - నేను రుద్ర యజ్ఞమును రచిస్తాను. ఇందులో ఆసురీ సంప్రదాయం వారు విఘ్నాలు వేస్తారు. ఇది శివబాబా రచించిన బేహద్ యజ్ఞము. దీని ద్వారానే మనుష్యుల నుండి దేవతలుగా అవుతారు. జ్ఞాన యజ్ఞము నుండి వినాశ జ్వాల ప్రకటితమయిందని మహిమ కూడా ఉంది. పాత ప్రపంచం వినాశనమైనప్పుడు, మీరు నూతన ప్రపంచంలో రాజ్య పాలన చేస్తారు. జనులు, మేము శాంతి కావాలని అంటాము, కానీ ఈ బి.కెలు వినాశనమవ్వాలని అంటారు. జ్ఞానం అర్థము చేసుకోనందున ఈ విధంగా అంటారు. తండ్రి అంటున్నారు - ఈ పాత ప్రపంచమంతా ఈ జ్ఞాన-యజ్ఞంలో స్వాహా అయిపోతుంది. పాత ప్రపంచానికి అగ్ని తగుల్కొంటుంది. ప్రకృతి ఆపదలు కూడా సంభవిస్తాయి. ఆవాల వలె అందరూ నలిగి సమాప్తమైపోతారు. కొంతమంది ఆత్మలు మాత్రమే మిగిలి ఉంటారు. ఆత్మలు అవినాశి. ఇప్పుడు బేహద్ హోలిక(కాల్చుట) జరుగుతుంది. అందులో శరీరాలన్నీ సమాప్తమైపోతాయి. ఆత్మలు పవిత్రమై వెళ్లిపోతాయి. అగ్నిలో అన్ని వస్తువులు శుభ్రమౌతాయి. శుద్ధత కొరకు యజ్ఞము చేస్తారు. అవన్నీ శారీరిక విషయాలు. ఇప్పుడు ప్రపంచమంతా స్వాహా అవ్వనున్నది. వినాశనానికి ముందే స్థాపన తప్పకుండా జరగాలి. మొదట స్థాపన తర్వాత వినాశనమని అందరికీ అర్థం చేయించండి. బ్రహ్మ ద్వారా స్థాపన జరుగుతుంది. ప్రజాపిత బ్రహ్మ ప్రసిద్ధి చెందినవారు. ఆదిదేవుడు, ఆది

దేవి - జగదంబ మందిరాలు లక్షల్లో ఉన్నాయి. ఎన్నో ఉత్సవాలు జరుగుతాయి. మీరు జగదంబ పిల్లలైన జ్ఞాన-జ్ఞానేశ్వరీలు తర్వాత మళ్ళీ రాజ - రాజేశ్వరీలుగా అవుతారు. మీరు చాలా ధనవంతులుగా అవుతారు. తర్వాత భక్తి మార్గంలో దీపావళి రోజున లక్ష్మి నుండి వినాశి ధనాన్ని కోరుకుంటారు. ఇక్కడ మీకు సర్వమూ లభిస్తాయి. ఆయుష్మాన్ భవ, పుత్రవాన్ భవ. అక్కడ 150 సంవత్సరాల ఆయువు ఉంటుంది. ఇక్కడమీరు ఎంత యోగము చేస్తారో, అంత ఆయువు వృద్ధి అవుతూ పోతుంది. మీరు ఈశ్వరునితో యోగము చేసి యోగేశ్వరులుగా అవుతారు.



తండ్రి అంటున్నారు - నేను చాకలిని, మురికి పట్టిన ఆత్మలను శుభ్రము చేస్తాను. తర్వాత శరీరాలు కూడా శుద్ధమైనవి లభిస్తాయి. నేను సెకండులో ప్రపంచంలోని వస్త్రాలన్నిటిని శుభ్రపరుస్తాను. కేవలం మన్మనాభవగా ఉండుట వలన ఆత్మ, శరీరం రెండూ పవిత్రంగా అవుతాయి. కనుక ఇది 'ఛూ' మంత్రమయ్యింది కదా. సెకండులో జీవన్ముక్తి! ఎంత సహజమైన ఉపాయం. నడుస్తూ తిరుగుతూ కేవలం తండ్రిని స్మృతి చేయండి. ఇక ఏ ఇతర కష్టమూ ఇవ్వను. ఇప్పుడు ఒక సెకండులో మీకు ఉన్నతమయ్యే కళ అవుతుంది. తండ్రి అంటున్నారు - నేను పిల్లలైన మీకు సేవకుడనై వచ్చాను. *ఓ పతిత పావనా! వచ్చి మమ్ములను పావనంగా చేయండి* అని మీరు పిలిచారు అనగా మీ సేవకుడను కదా. మీరు ఎప్పుడైతే చాలా పతితులుగా అవుతారో అప్పుడు చాలా తీవ్రంగా పిలుస్తారు. ఇప్పుడు నేను వచ్చాను.నేను కల్ప-కల్పము వచ్చి పిల్లలకు మంత్రమిస్తాను -'*నన్ను స్మృతి చేయండి .*' మన్మనాభవకు అర్థమిదే. తర్వాత మళ్ళీ విష్ణుపురానికి యజమానులుగా అవుతారు. మీరు విష్ణుపురంలో రాజ్యము తీసుకునేందుకు వచ్చారు. రావణపురము తర్వాత విష్ణుపురం

వస్తుంది. కంసపురం తర్వాత కృష్ణ పురము వస్తుంది. ఎంతో సులభంగా అర్థం చేయించ బడ్తుంది. తండ్రి అంటున్నారు - ఈ పాత ప్రపంచం పై మమకారాన్ని తొలగిస్తే చాలు. ఇప్పుడు మనము 84 జన్మలు పూర్తి చేశాము. ఈ పాత శరీరాలను వదిలి నూతన ప్రపంచంలోకి వెళ్తాము. స్మృతి ద్వారానే మీ పాపాలు నశిస్తాయి. ఇంతటి సాహసం తప్పకుండా చేయాలి. మంచిది.

మధురాతి మధురమైన అపురూపమైన పిల్లలకు మాత - పిత, బాప్‌దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్‌మార్నింగ్ ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము :-

1. నోటి నుండి సదా జ్ఞానామృతమే వెలువడాలి. జ్ఞానము ద్వారానే అందరికీ సద్గతిని కలిగించాలి. ఒక్క తండ్రి ద్వారానే జ్ఞానము వినాలి, ఇతరులతో వినరాదు.

2. ఉన్నతమయ్యే కళలో వెళ్లేందుకు నడుస్తూ - తిరుగుతూ తండ్రిని స్మృతి చేయు అభ్యాసం చేయాలి. ఈ పాత ప్రపంచం, పాత శరీరం పై మమకారాన్ని తొలగించాలి.

వరదానము :- " ఒకే దారి(రాస్తా) మరియు ఒక్కరితోనే సంబంధం (రిస్తా) ఉంచుకునే సంపూర్ణ ఫరిస్తా భవ "

నిరాకారము లేక సాకార రూపం ద్వారా బుద్ధి యొక్క సాంగత్యం లేక సంబంధం ఒక్క తండ్రితో పక్కాగా ఉంటే ఫరిస్తాగా అవుతారు. ఎవరి సర్వ సంబంధాలు లేక బంధుత్వాలు ఒక్కరితోనే ఉన్నాయో వారే సదా ఫరిస్తాలు. ఎలాగైతే గవర్నమెంటువారు దారిలో 'ఈ దారి మూయబడింది' అని బోర్డు పెట్తారో, అలా అన్ని దారులు మూసేస్తే బుద్ధి భ్రమించడం మానేస్తుంది. బాప్‌దాదా ఇదేఆజ్ఞాపిస్తున్నారు - ' మొదట అన్ని దారులు మూసేయండి ' తద్వారా సహజంగానే ఫరిస్తాలుగా అవుతారు.

స్లోగన్ :- " సదా సేవ చేయాలనే ఉమంగ - ఉత్సాహంలో ఉండడమే మాయ నుండి సురక్షితంగా ఉండే సాధనం "

మాతేశ్వరి గారి అమూల్యమైన మహావాక్యాలు - నిరంతరం ఈశ్వరీయ స్మృతి

పరమాత్మ స్మృతిలో కూర్చుంటారు, కూర్చోవడమంటే అర్థమేమి? మనము కేవలం పరమాత్మని స్మృతిలో కూర్చోరాదు, కాని మీ ఈశ్వరీయ స్మృతి అయితే నిత్యమూ నడుస్తూ -తిరుగుతూ ప్రతి సమయంలో చేయాలి. స్మృతి కూడా ఏ వస్తువు లేక వ్యక్తి గురించిన పరిచయముంటుందో అవే గుర్తుంటాయి. వారి నామ-రూపాలు ఏమిటో తెలిసి ఉండాలి. ఒకవేళ ఈశ్వరుడు నామ-రూపాలకు అతీతమైన వాడని అనుకుంటే ఏ రూపాన్ని స్మృతి చేయాలి? ఒకవేళ ఈశ్వరుడు సర్వవ్యాపి అయితే వారి వ్యాపకత సర్వత్ర ఉండాలి, అందరిలో ఉండాలి. అలాంటప్పుడు ఎవరిని స్మృతి చేయాలి. ఒకవేళ స్మృతి అనే శబ్ధముంది

అంటే, దానికి రూపం కూడా తప్పకుండా ఉంటుంది. స్మృతి అనగా ఒకరు స్మృతి చేసేవారు, రెండవవారు ఎవరిని స్మృతి చేస్తారో వారు. కనుక స్మృతి చేసేవారు, వారి కంటే వేరుగా(భిన్నంగా) ఉంటారు. కనుక ఈశ్వరుడు సర్వవ్యాపి కాదు. ఒకవేళ ఎవరైనా ఆత్మలమైన మనము పరమాత్ముని అంశము అని అంటే, పరమాత్మ కూడా తుంటలు, తుంటలుగా ఉన్నారని అర్థమవుతుంది. అప్పుడు పరమాత్మ వినాశి అవుతాడు. వారి స్మృతి కూడా వినాశి అవుతుంది. ఇప్పుడు జనులకు పరమాత్ముడు అవినాశి, వారి సంతానమైన ఆత్మలు కూడా అవినాశి అని తెలియదు కనుక మనము పరమాత్ముని వంశము కాని, అంశము కాదు. ఇప్పుడు జ్ఞానం కావాలి. ఆ జ్ఞానాన్ని స్వయం పరమాత్ముడే వచ్చి పిల్లలైన మనకు ఇస్తాడు. పిల్లలైన మన పట్ల పరమాత్ముని మహావాక్యము ఏమంటే - పిల్లలూ! నేను ఎవరో, ఎలా ఉన్నానో ఆ రూపాన్ని స్మృతి చేసినందున, మీరు నన్ను తప్పకుండా ప్రాప్తి చేసుకుంటారు. ఒకవేళ సుఖ-దు:ఖాలకు అతీతమైన నేను సర్వవ్యాపిగా అయి ఉంటే, ఈ నాటకంలో సుఖ-దు:ఖాలే ఉండవు. కనుక నేను సర్వవ్యాపిని కాను. నేను కూడా ఆత్మ వంటి ఆత్మనే కాని సర్వ ఆత్మల గుణాల కంటే నా గుణము శ్రేష్ఠమైనది(పరమ) అందుకే నన్ను 'పరమ-ఆత్మ' అనగా పరమాత్మ అని అంటారు. అచ్ఛా. ఓంశాంతి.

-: ఓంశాంతి :-